# స్పీడ్ మనీ

మా ఇంటిముందు మూడడుగుల మేరకు స్థలముంది. అక్కడ రకరకాల పూలమొక్కలు, ఆకర్షణీయమైన క్రోటన్ మొక్కలు పెంచుతున్నాం. ఎంత నగరాలలో వున్నా చెట్టూ చేమా, నీళ్ళూ గడ్డి వంటి ప్రకృతి వరాలకు దూరంగా బతకలేము కదా! పైన కాసింత ఆకాశం, చుట్టూ గాలీ వెలుతురూ వుంటే అంతకుమించి ఏమి కోరుకుంటాం! ఈ మాత్రం లేకపోతే కాంక్రీటు అడవుల్లో ఊపిరెలా పీల్చుకుంటాం?

ఈ ఉద్దేశ్యంతోనే ప్లాటు కొనగానే కాంపౌండ్‌వాల్ మూడడుగులు లోపలికి పెట్టుకుని బయట మొక్కలు పెంచుకొందామని అనుకొన్నాం. అలాగే పెంచుతున్నాం. దానిచుట్టూ వెదుర్ల దడి కట్టినా, తీగల కంచె వేసినా మొక్కలు పాడవుతూనే వున్నాయి. దారినపోయేవాళ్ళు వస్తూ పోతూ, ఒక ఆకో, ఒక రెమ్మో తుంచి కిందపారేస్తుంటారు. లేదా చేతిలో పట్టుకొని పక్కనున్న వాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ ఆ రెమ్మని తమ హావభావాలకు అనుగుణంగా ఊపుతూ పోతుంటారు. ఇక హఠాత్తుగా వచ్చిపడే ఆవుల సంగతి, మేకలు వగైరాల సంగతి చెప్పనవసరం లేదు. అందుకే అనుకొన్నాను చుట్టూ మూడడుగుల ఎత్తు గోడపెట్టి దానిమీద చక్కటి డిజైన్ వున్న గ్రిల్ వేద్దామని. మొక్కలూ పదిలంగా ఉంటాయి. చూడటానికి తోటా సొగసుగా వుంటుంది.

పక్కన బిల్డింగులకు పనిచేస్తున్న కాంట్రాక్టరును సంప్రదించాను.

"దానికేముంది సార్. ఇటుకలు, తక్కిన సామాను తెప్పించండి. మూడు రోజుల్లో పని పూర్తవుతుంది. ఆ తర్వాత గ్రిల్ అమర్చటానికి వెల్డర్‌ను పిలిపించండి..."

"బాబ్బాబూ ఈ పనులన్నీ నాకు అప్పజెప్పకు. ఈలాంటి ఝుంఝూటాలన్నీ నా వల్ల అయ్యేవి కావు. నువ్వు ఏర్పాటు చేసేయ్ ఎంతమొత్తమో చెప్పావంటే నీ డబ్బు నీకు ముట్టిపోతుంది."

ఆ అబ్బాయి సరేనని మరుసటిరోజే ఇటుకలు తెప్పించాడు. దానికి డబ్బు చెల్లించాను. కొంచెం సిమెంటు, ఇసుక వగైరాలు వచ్చాయి. మూడవరోజు ఇద్దరు కుర్రాళ్ళు వచ్చి పని ప్రారంభించారు. సాయంత్రానికి రెండు వరుసల ఇటుకలు పేర్చటమయింది.

ఆ పనివాళ్ళు అటు వెళ్ళారో లేదో బెల్ మోగింది. వెళ్ళి చూశాను. ఎవరో ఒకతను నన్ను చూసి నమస్కారం చేశాడు. నేను ప్రతి నమస్కారం చేశాను.

"బయట గోడ కట్టిస్తున్నారా?" అన్నాడతను.

"ఆ -.కొంచెం. మూడడుగులు. తోట కోసమని... ఇంతకూ మీరెవరు?"

"ఇక్కడే పోలీస్ స్టేషన్ నుంచి" అన్నాడు చొరవగా లోపలికి వస్తూ.

నేను కాస్త నిటారుగా అయిపోయాను. "కూర్చోండి" అన్నాను.

సోఫాలో కూర్చున్నాడు. "చూడండి అంకుల్. మీరు అక్కడ గోడ కట్టే మేము యాక్షన్ తీసుకోవలసి వుంటుంది."

"దేనికి?"

"దేనికేమిటి? అన్నీ తెలిసి తెలీనట్లు మాట్లాడుతారు. పబ్లిక్ ప్రాపర్టీలో గోడ కట్టే మేము చూస్తూ ఎలా ఏరుకొంటాం?"

"పబ్లిక్ ప్రాపర్టీ ఏమిటి? ఇది మా ఇల్లు. మా స్థలం."

"గేటు లోపల మీ స్థలం. బయట..."

"బయట కూడా బాబూ. తోటకోసం పెట్టుకున్నాం."

"భలే మాట్లాడుతారు అంకుల్. చిన్న పిల్లలకు చెప్పినట్టుంది. మొక్కలు నాటితే పోనీ అని ఊరుకొంటారుగాని గోడపెట్టే ఎవరూరుకొంటారు."

"ఎవరికేం నష్టమొచ్చింది? మా ఇల్లు, మా స్థలం, మా ఇష్టం."

"అలా బుజువు చెయ్యొద్దూ" అన్నాడతను గడుసుగా.

"ఎందుకు చెయ్యలేను? ప్లాటు కాగితాలున్నాయి. ఎవరైనా చూసుకోవచ్చు."

"పోనీలేండి. ఆ చూసే పని కోర్టు చూసుకుంటుంది. మీ మీద కేసు పెడుతున్నామని హెచ్చరించటానికే వచ్చాను. వస్తాను" అని లేచాడు.

"బాబ్బాబూ ఇదెక్కడి బెడద? కోర్టు వెంట మేమెక్కడ తిరుగుతాము? ఇది అనవసరమైన కేసు. నా పనులు ఆగటం, కోర్టుల చుట్టూ తిరగటం, డబ్బు ఖర్చుగాక దీనివల్ల ఫలితమేమీ లేదు."

కాస్సేపు ఆగి నిదానంగా నా ముఖంలోకి చూశాడు. పెదవులపై చిరునవ్వు మెదిలింది. "మీకు తెలియనిదేముంది అంకుల్. అనుభవజ్ఞులు. మీరనుకోవాలేగాని అన్నీ సెటిలవుతాయి. ఆలోచించుకోండి. రేపు మళ్ళీ వస్తాను" అంటూ పెద్ద పెద్ద అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు.

నాకేం తోచలేదు. ఆ రాత్రి మా అబ్బాయి మురళితో పోలీసు వచ్చిన సంగతి చెప్పాను. "చూద్దాంలెండి. ముందు మన పని కానివ్వండి" అన్నాడు తొణక్కుండా.

మా మురళి కూడా ఇంజనీరే. ఈ మధ్యనే ఓ కన్సల్టెన్సీలో చేరాడు. ఆర్కిటెక్టులు, ఇంజనీర్లు, ఇంటీరియర్ డిజైనర్లు అయిన ఆరేడుమంది కలిసి ఒక కన్సల్టెన్సీ పెట్టుకొన్నారు. బిజినెస్ బాగానే వుంది.

మరునాడు మా ఇంటికి గ్రిల్స్, రెయిలింగులు కూడా వచ్చాయి. వాటికీ డబ్బు చెల్లించాను. మధ్యాహ్నానికి గోడ పని ఒక కొలిక్కి వచ్చినట్లే అనుకొన్నాను. కుర్రాళ్ళిద్దరూ భోజనాలకు వెళ్ళారు. నేను కాస్త విశ్రాంతిగా పడుకొన్నాను. బజ్‌మంట్ డోర్ బెల్ మోగింది. ఇంకా రెండయినా కాలేదే, వీళ్ళప్పుడే వచ్చేశారా అనుకొంటూ వెళ్ళి తలుపు తెరిచాను. ఎదురుగా ఒక పొడవాయన, ఒక పొట్టి ఆయనా నిల్చుని వున్నారు. "ఎవరు కావాలి?" అని అడిగాను.

"ఈ ఇంటి యజమాని మీరేనా?" పొట్టి ఆయన అడిగాడు. వీళ్ళిద్దరిలో ఇతనే పెద్దవాడు.

"అవును. మీరెవరు?"

"మేము మునిసిపల్ కార్పొరేషన్ నుంచి వచ్చాము" అన్నాడు పొడవతను, కళ్ళజోడు సర్దుకుంటూ.

'ఎందుకు?' అన్నట్టు చూస్తూ "లోపలికి రండి" అని పిలిచాను.

ఇద్దరూ వచ్చి ఠీవిగా సోఫాలో కూర్చున్నారు. అయితే వాళ్ళిద్దరి మధ్య కాస్త దూరముంది. బహుశా ఒకరు సీనియరు, మరొకరు జూనియరు కావచ్చు. అటుపక్కగా నేనూ కూర్చున్నాను.

"చూడండి. మీరు బయట గోడ కట్టడం ఇల్లీగల్. చట్టం ఒప్పుకోదు" అన్నాడు పొడవాయన.

"అది మా స్థలమేనండి. పూలమొక్కలూ అవీ పదిలంగా వుంటాయని మూడడుగుల మేరకు గోడ కట్టిస్తున్నానంతే."

"దీనికి పర్మిషన్ తీసుకున్నారా?" రెండో అతను అడిగాడు. మాట గంభీరంగా వుంది.

"మా ఇంట్లో మేము గోడ కట్టడానికి పర్మిషన్ ఎందుకండీ?" అన్నాను.

"చాలా అమాయకంగా మాట్లాడుతున్నారే! అప్రూవ్డ్ ప్లాన్‌లో, అదే ఇదివరకు మీరు మునిసిపాలిటీకి ఇచ్చిన ప్లానులో దీని ప్రస్తావన ఉందా?"

"అది అంత ముఖ్యమనుకోలేదు."

"మీరు అనుకొంటే సరిపోతుందేమిటి? దీనికి పెనాల్టీ ఉంటుంది. లేదా గోడయినా కూలగొట్టించాలి. అందుకే మీకు వార్నింగ్ ఇవ్వటానికి వచ్చాం" అంటూ ఇద్దరూ పైకి లేచారు.

నేనేం మాట్లాడలేకపోయాను. వాళ్ళిద్దరూ గడప దాటుతుండగా అన్నాను. "మరో మార్గం లేదా?"

"ఆలోచించాలి. మీకు ఇబ్బంది కలిగించటం మా ఉద్దేశ్యం కాదనుకోండి" అంటూ ముందుకు కదిలారు.

ఆ పొడవాయన మళ్ళీ వెనక్కి వచ్చాడు. "ఎందుకొచ్చిన బెడద. ఏదో ఒప్పందం కుదిరితే మిమ్మల్నెవరూ బాధించరు" అన్నాడు మెల్లగా.

"మేము ఫీల్డ్‌లో పనిచేవాళ్ళం. మా రిపోర్టు మీదే అంతా ఆధారపడి వుంటుంది. ఆలోచించండి. మళ్ళీ కలుస్తాం" అని గబగబ నడుచుకుంటూ తన సహోద్యోగిని చేరుకొన్నాడు.

ఇంతలో పనివాళ్ళు వచ్చి వాళ్ళ పని ప్రారంభించారు. పని ఆపించాలా వద్దా అని ఆలోచించాను. కొన్న మెటీరియల్ ఎవరూ వాపసు తీసుకోరు. ఇప్పటివరకు జరిగిన పనికి ఎలాగూ డబ్బు చెల్లించాలి. ఆ కట్టిన గోడ తీసి పక్కకు పెట్టినందుకూ డబ్బు చెల్లించాలి. ఇదేదో సామెతలా కొండనాలుక, ఉన్ననాలుక బాపతులా వుంది.

బెంగుళూరులో విధానసౌధ కట్టినప్పుడు 'ప్రభుత్వం పని దేవుడి పని' అని చాలా కళాత్మకంగా వ్రాయించారట. దీనికి బోలెడు ఖర్చయిందట. దానికి అందరూ అభ్యంతరం చెప్పారట. దానిని తీయించి సరిచేయించటానికి మరింత డబ్బు ఖర్చయిందట. ఈ మాట మా లెక్చరర్ గొప్ప జోక్‌గా చెపుతుండేవారు. దానికి మేమందరం నవ్వుకొనే వాళ్ళం. ఈ రోజు నా పరిస్థితి అలాగే వుంది.

ఇంతవరకూ నిన్న పోలీసు, ఈ రోజు మునిసిపాలిటీ వాళ్ళు చెప్పిందేమిటి? పని మానిపించమని చెప్పలేదు. గోడ కట్టొద్దనలేదు. అన్నీ సెటిలవుతాయని ఒకరు, ఒప్పందం కుదుర్చుకోమని మరొకరు అంటున్నారు.

నేను ఇప్పటివరకు ఏ డొంకతిరుగుడూ లేకుండా నా పద్ధతి ప్రకారమే జీవితం నెట్టుకొస్తున్నాను. లౌక్యమని నన్ను నేను ఎప్పుడూ మభ్యపెట్టుకోలేదు. ఇంత మాత్రంతో నేను గొప్పవాడినని, నావల్లనే ధర్మం నాలుగు పాదాల నడుస్తోందనే భ్రమలేవీ నాకు లేవు.

ఒక విషయం మాత్రం నాకు అర్థం కాలేదు. నేను చట్టవిరుద్ధమైన పనేదీ చెయ్యలేదు. నా పనివల్ల ఇతరులకు ఇబ్బందీ లేదు. అయినా నేనో నేరస్థునిలాగా వీళ్ళందరి ముందూ నిలబడటం, శిక్ష తప్పించుకొనే మార్గాలు వెతకడం నాకసలు బాగుండలేదు.

ఆ రాత్రి మళ్ళీ మురళితో ఈ విషయాలన్నీ చెప్పాను. "పని ఆపించాలో ఏమిటో? నాకేం తోచటం లేదు. ఇప్పటికే చాలా ఖర్చయింది" అన్నాను.

"ఇంటి కాగితాలు కాస్త తీసిపెట్టండి నాన్నగారూ. నేను మునిసిపల్ ఆఫీసుకు వెళ్తాను" అన్నాడు వాడు హాయిగా టి.వి. ఛానెల్స్ మారుస్తూ.

మునిసిపల్ ఆఫీసంటే పెద్ద గందరగోళం. వాళ్ళు మన మాట వింటారా? వింటే మాత్రం త్వరగా నిర్ణయాలు తీసుకుంటారా? అన్నీ సవ్యంగా వున్నా నానా ఇబ్బందీ పడతాం. కొంచెం చిక్కు రానే రాకూడదు గాని వచ్చిందటే వాళ్ళా అవకాశం జారవిడుచుకొంటారా? అంతవరకు మన పనేమవుతుంది? మధ్య మధ్యలో వచ్చే ఈ బెదిరింపుల మాటేమిటి? గోరంత కొండంతయి కోర్టులు కేసులు అంటే అంత సమయం, డబ్బు ఎవరి దగ్గరుంటాయి? ఈ అనుమానాలన్నీ అబ్బాయి ముందు పెట్టాను.

"మీరు మరీ ఇదయిపోతారు నాన్నగారూ. అంతగా ఆలోచించకండి. మన పని మనం చేద్దాం. మన ప్రయత్నాలు మనం చేద్దాం. అదేదో సామెత చెప్పినట్టు వంతెన దగ్గరకు వచ్చినప్పుడే దానిని దాటుతాం. ముందునుంచీ ఆలోచనెందుకు? ఇబ్బంది వచ్చినప్పుడు దాని గురించి ఆలోచిద్దాం. ఇప్పటి నుంచి హైరానా పడకండి" అంటూ స్పోర్ట్స్ ఛానెల్ చూడటం మొదలు పెట్టాడు.

మరుసటి రోజు ఆ కాగితాలు అవీ తనతోపాటు తీసుకెళ్ళాడు మురళి. ఆరోజే గోడ పని పూర్తయిపోయింది. ఇక గ్రిల్స్ పెట్టడమే తరువాయి.

"రేపు ఒకటి రెండు గంటల్లో ఈ పని పూర్తయిపోతుంది. కావాలంటే రేపు మధ్యాహ్నానికి పెయింటరును పిలవండి" అన్నాడు కంట్రాక్టరు. నా మొహం చూసి ఏమనుకొన్నాడో ఏమో? "సరేలెండి రేపు పెయింటరును పంపిస్తాను" అన్నాడు.

మూడు రోజులు సెలవులు కలిసి వచ్చాయి. రెండు రోజులు సెలవు పెట్టాను. కాబట్టి రేపు పనయిపోతేనే సుఖం. ఆ మాటే కంట్రాక్టరుతో అన్నాను. "మీరు నిశ్చింతగా వుండండి సార్. మీరు లేకపోయినా మీ పని నిరాటంకంగా పూర్తవుతుంది" అన్నాడు.

పోలీసు మాట, మునిసిపాలిటీ వారి మాట నేనతనితో అనలేదు. కాని అతను వెళ్తూ, "వీళ్ళూ వాళ్ళూ వచ్చినా ఇబ్బందేం లేదు. మాకిదంతా మామూలే" అంటూ నవ్వాడు. నేనేం జవాబు చెప్పలేదు.

ఆ రోజంతా ఎవరెప్పుడు ఏ తాఖీదు తెస్తారో అని కాస్త బెరుకుగానే గడిచింది. ఆ రాత్రి మురళి వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది. ఆ రాత్రి ఏమీ మాట్లాడలేదు. మరుసటి రోజు మురళి తన ఆఫీసుకు సిద్ధమవుతున్నాడు. వాడు నాకంటే ముందే

వెళ్తాడు. నేను ఒక అరగంట తర్వాత వెళ్తాను. "మురళీ మనిద్దరం వెళ్ళిపోతాం. ఇంటి దగ్గర మీ అమ్మ ఒకతే వుంటుంది. వీళ్ళూ వాళ్ళూ వచ్చి తనను ఇబ్బంది పెట్టరు కదా!" అన్నాను.

"దేని సంగతి? ఆ గోడ సంగతేనా? మరేం ఫర్వాలేదు నాన్నగారూ. త రోజు కార్పొరేషన్ నుంచి 'నో అబ్జెక్షన్' కాగితాలు పట్టుకొస్తాను" అన్నాడు యథాలాపంగా తన బ్రీఫ్‌కేసు చేతిలో పట్టుకొంటూ.

నా చెవులు నమ్మలేకపోయాను.

"నిజంగానా? ఇంత త్వరగా పనయిందా?"

"దీనికి సంబంధించిన ఆఫీసరుకు ఆ కాగితాలన్నీ చూపించి అన్ని విషయాలూ మాట్లాడాను. అతను సరేనన్నాడు. ఈ రోజు పర్మిషన్ కాగితం తీసుకోమన్నాడు."

"వెరీస్మార్ట్. నమ్మలేకపోతున్నాను. నిన్ను పొగడాలా లేక ఆ ఆఫీసరునా? ఇదేనా రామరాజ్యమంటే" అన్నాను నవ్వుతూ.

"ఏమయినా అనుకోండి. మన పని కావటం ముఖ్యం. మా భాషలో దీనిని 'స్పీడ్ మనీ' ప్రభావమంటారు."

"అంటే..."

"చెప్తే మీకు కోపమొస్తుంది. కాని ఈ కాలంలో పని జరగాలంటే, ముఖ్యంగా వేగంగా జరగాలనుకొంటే ఆ వేగానికి తగిన ఇంధనం అవసరమవుతుంది. దానినే 'స్పీడ్ మనీ' అని అంటారు."

"అంటే లంచమే కదా!"

"అబ్బెబ్బే. కాని పనిని డబ్బిచ్చి చేయించుకొంటే అది లంచం. అవినీతి. సరయిన పనిని వేగంగా చేయించుకొంటే అది 'స్పీడ్ మనీ'. వెరీఫేర్. కాదంటారా?" అని నవ్వుతూ వెళ్లిపోయాడు మురళి. వీళ్ళ చదువుల్లా వీళ్ళ అభిప్రాయాలు దిగుమతి అయ్యాయేమో అని అనుకొన్నాను.

నవ్య వారపత్రిక
15 జూన్ 2005